క్లుప్తంగా

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

బాడంగి: స్థానిక గురుకుల పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, గ్యాస్ లీకేజి, ప్రమాదవశాత్తు, మానవ తప్పిదాల కారణంగా జరిగే ప్రమాదాల నుంచి సురక్షితంగా ఎలా బయటపడాలి, మంటలను ఎలా అదుపులోకి తీసుకురావాలన్న దానిని వివరించారు. కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ రామినాయుడు, ప్రిన్సిపాల్ రామదాసు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపరికరాలు అందజేత



ప్రధానోపాధ్యాయుడికి క్రీడా పరికరాలు అందజేస్తున్న పొనుగుటివలస యువకులు

రాజాం సిటీ: మున్సిపాలిటీ పరిధిలోని పొనుగుటివలస గ్రామంలోని ఎంపీపీ పాఠశాలకు అదే గ్రామానికి చెందిన శివరామాంజనేయ యువజన సంఘం సభ్యులు క్రీడాపరికరాలు బుధవారం అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్న సదుద్దేశ్యంతోనే తాము చదువుకున్న పాఠశాలకు వీటిని అందించామని యువకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజయకుమారి, ఉపాధ్యాయుడు నూకరాజు, యువజన సంఘం సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, బి.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మట్టినమూనాల సేకరణ



మట్టినమూనాల సేకరణలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు శ్యామసుందరరావు

బొబ్బిలి: మండలంలోని కలువరాయి గ్రామ పొలాల్లో మట్టినమూనాల సేకరణ బుధవారం చేపట్టారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మజ్జి శ్యామసుందరరావు మాట్లాడుతూ మట్టినమూనాలను పరీక్షించడం ద్వారా ఏ నేలలో ఏ పంట వేస్తే అధిక దిగుబడి వస్తుందో తెలుస్తుందన్నారు. తద్వారా రైతుకు తక్కువ పెట్టుబడి, అధిక ఆదాయం వస్తుందన్నారు. రైతు భరోసా పథకం నిధుల కోసం కౌలు రైతులు కూడా ఆర్‌బీకేలకు వెళ్లి, దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రూ.2 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సంతకవిటి: సంతకవిటి–హొంజరాం మార్గంలో పీజే పేట గ్రామం నుంచి లాబాం వంతెన అప్రోచ్ రోడ్డు వరకు రూ.2 లక్షల వ్యయంతో రోడ్డు నిర్మిస్తున్నారు. గతంలో ఇక్కడి మట్టి రోడ్డు గుంతలమయం కావడంతో ఆ దారిలో ప్రయాణించేందుకు రంగారాయపురం, కె.ఆర్.పురం గ్రామస్తులు తీవ్ర అవస్థలు పడేవారు. స్పందించిన జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్మోహన్‌రావు, మండల పరిషత్ నిధులతో యుద్ధ ప్రాతిపదికన రోడ్డు పనులకు కృషి చేశారు. బుధవారం రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాల మేర పనులు చేపట్టాలని సూచించారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పంపిణీకి 519 ధ్రువపత్రాలు సిద్ధం

మెంటాడ: మండలంలోని కొంపంగి, మీసాలపేట గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష శిబిరం కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ తివిక్రమ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పంపిణీకి 519 ధ్రువ పత్రాలు సిద్ధం చేశామన్నారు. లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆన్‌లైన్‌లో ప్రతీఒక్కరి ఆరోగ్య వివరాలు

జామి: వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చిన ప్రతి ఒక్కరి ఆరోగ్య రికార్డు ఆన్‌లైన్‌లో పొందుపరచాలని డీఎంహెచ్‌ఓ ఎస్.భాస్కరరావు వైద్యసిబ్బందికి సూచించారు. జామి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, భీమసింగి హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌ను బుధవారం సందర్శించారు. రికార్డులు, మందుల నిల్వలను, పీహెచ్‌సీలో నాడు–నేడులో భాగంగా నిర్మించిన నూతన భవనాన్ని పరిశీలించారు. జిల్లా ఎపిడిమియాలజిస్ట్ వెంకటేష్, స్థానిక వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్‌ప్రేమ్‌కుమార్, సీహెచ్‌ఓ ప్లారెన్స్, హెచ్‌వీ భవానిపాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా పథకాలు



రేగిడి: మహిళకు ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



తెర్లాం: జోరువానలోనూ ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు

రేగిడి: అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్ సీపీకే దక్కుతుందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొమెర గ్రామపంచాయతీ, మంగళాపేటలో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలని కోరారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు సంక్షేమ పథకాలు కూడా జోరుగా అమలు చేస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఆయన పథకాలు రూపొందించి, అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అమలైనన్ని పథకాలు మరే రాష్ట్రంలో లేవన్నారు. ఇప్పటివరకు అమలైన పథకాల్లో ఇంతవరకు ఏ ఒక్క పథకంలోనూ అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శమన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 98 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన గొప్పతనం సీఎం జగన్‌దేనన్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వం ఏ అభివృద్ధి పని జరగాలన్నా, సంక్షేమ పథకం కావాలన్నా కమిటీల పేరిట కాలయాపన చేసేదని విమర్శించారు. ఒకప్పుడు ఉచిత పథకాలతో రాష్ట్రం మరో శ్రీలంక, సోమాలియా అయిపోతుందన్న టీడీపీ అధినేత చంద్రబాబు, ఉచిత పథకాలు నేను కూడా ఇస్తానని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించుకుని, అధికారంలోకి తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి. అచ్చెన్నాయుడు, వి.జగన్‌మోహనరావు, వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ జి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ పి.లక్ష్మునాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్ సీఎం జగన్..

తెర్లాం: పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, సంక్షేమ పాలనకు కేరాఫ్ అడ్రస్‌గా సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిలిచారని బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు ప్రశంసించారు. బుధవారం సాయంత్రం మండలంలోని సతివాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. జోరు వానను కూడా లెక్క చేయకుండా గొడుగులు వేసుకుని మరీ ఇంటింటికీ వెళ్లిన ఎమ్మెల్యే నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్ర చరిత్రలో గతంలో ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌దేనన్నారు. పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లోనూ సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో బొబ్బిలి, తెర్లాం వైఎస్సార్ సీపీ మండలాల పార్టీ అధ్యక్షులు ఎస్. వేణుగోపాలనాయుడు, ఎన్. బాబ్జిరావు, ఎంపీపీ ఎన్.ఉమాలక్ష్మి, జెడ్పీటీసీ జి.లూర్దు రామారావు, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి. శ్రీనివాసరావు, సర్పంచ్ పి.జానకీరామ్‌ప్రసాద్, ఎంపీడీఓ ఎస్. రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు

రేగిడి: మండలంలోని అంబఖండికి చెందిన పాలవలస చిన్నంనాయుడు ఇటీవల మృతి చెందగా, ఆయన భార్య జయమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద రూ.10 వేల తక్షణ సాయంను ఎమ్మెల్యే కంబాల జోగులు చేతులమీదుగా బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పి.సత్యవతి, మాజీ సర్పంచ్ వేణుగోపాలనాయుడు, పంచాయతీ కార్యదర్శి హేమసుందరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచితంగా యాంటీ ర్యాబిస్ టీకాలు

బాడంగి: వరల్డ్ జునోసిస్ డే సందర్భంగా స్థానిక పశువైద్య కేంద్రంతో పాటు వాడాడ పశువైద్య కేంద్రంలో పెంపుడు కుక్కలకు యాంటీ ర్యాబిస్ టీకాలు గురువారం వేయనున్నట్లు పశువైద్యాధికారులు గోవింద్, రాధిక బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏటా జూలై ఆరో తేదీన ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా కుక్కల నుంచి మనుష్యులకు వ్యాధులు సంక్రమించకుండా ఈ టీకాలను ఉచితంగా వేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోతే చర్యలు



మధ్యాహ్న భోజనం వంటకాలు రుచి చూసి, పరిశీలిస్తున్న అధికారులు



రామభద్రపురం: మధ్యాహ్న భోజనం తింటున్న అధికారులు

తెర్లాం: జగనన్న గోరుముద్ద పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనాలు పెట్టకపోతే చర్యల తప్పవని మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ హెచ్చరించారు. బుధవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన వారు మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి, చూసి పరిశీలించారు. అనంతరం వంట నిర్వాహకులతో మాట్లాడిన వారు భోజనాలు రుచి, శుచి కలిగి ఉండాలని, మెనూ అమలులో లోపాలుంటే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందించిన అధికారులు..

రామభద్రపురం: కొన్ని పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం బాగుండడం లేదన్న విషయం విద్యార్థుల తల్లిదండ్రులు మండలంలో ఈ నెల 4వ తేదీన జరిగిన అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రాజారావు, ఎంపీడీఓ రమామణి, ఎంఈఓ తిరుమలప్రసాద్ బుధవారం స్థానిక పాఠశాలను సందర్శించి, అక్కడి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను రుచి చూసి, పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాలు వండి పెట్టాలని, పదార్థాలు రుచి, శుచితో కూడా ఉండాలని లేకపోతే చర్యలు తప్పవని వంట నిర్వాహకులను హెచ్చరించారు. ప్రతిరోజూ వంటకాలను పరిశీలించాలని ప్రధానోపాధ్యాయుడు కామేశ్వరరావుకు సూచించారు.

వైద్య శిబిరం పరిశీలన



వైద్య శిబిరం వద్ద మందుల ప్రదర్శనను తిలకిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మణరావు, ఎంపీడీఓ రామకృష్ణ

తెర్లాం: స్థానిక గ్రామ సచివాలయం–2 దగ్గరున్న జగనన్న సురక్ష శిబిరం వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని చీపురుపల్లి డీఎల్‌డీఓ, ఉపాధి ఏపీడీ వి.లక్ష్మణరావు బుధవారం పరిశీలించారు. తెర్లాం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో ఏయే రకాల వైద్యారోగ్య సేవలు అందిస్తున్నారు, ఎన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయన్న విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అవసరమైన ప్రతి ఒక్కరికీ వైద్యసేవలు అందేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో విలేజ్ హెల్త్ క్లినిక్ ఎంఎల్‌హెచ్‌పీ వై.శ్రీదేవి, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న సురక్ష’తో సత్వర సేవలు



రేగిడి: అంబఖండిలో ధ్రువీకరణపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగులు



రాజాం : పొగిరిలో ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష శిబిరంలో అధికారులు



తెర్లాంలో కుల, ఆదాయ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

రేగిడి: ప్రజలకు కావాల్సిన ప్రభుత్వ సేవలను సత్వరమే అందించేలా ప్రభుత్వం చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కంబాల జోగులు కోరారు. బుధవారం మండలంలోని అంబఖండి–1, అంబఖండి–2 గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలు గతంలో పడిన ఇబ్బందులు మళ్లీ పడకూడదన్న ఉద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇటువంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారని తెలిపారు. టీడీపీ హయాంలో ఎటువంటి సేవలు కావాలన్నా మండల కేంద్రానికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు గ్రామంలోని సచివాలయంలోనే అన్ని రకాల సేవలందుతున్నాయన్నారు. అనంతరం పలు ధ్రువీకరణపత్రాలను గ్రామస్తులకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు టి.అచ్చెన్నాయుడు, వి.జగన్మోహన్‌రావులు, తహసీల్దార్ టి.కల్యాణ చక్రవర్తి, ఎంపీడీఓ నాగమణి, ఎంపీటీసీ పి.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎంతో మేలు..

తెర్లాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి అన్నారు. బుధవారం తెర్లాం–2 గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష శిబిరాన్ని ఏర్పాటు చేసి, సచివాలయం పరిధిలోని రైతులు, ప్రజలు, విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, వివాహ ధ్రువ పత్రాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల సిటిజన్ సర్వీసులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ సత్యనారాయణ, సర్పంచ్ బి.రూప, బొబ్బిలి ఏఎంసీ చైర్మన్ బి.శ్రీనివాసరావు, మండల ప్రత్యేకాధికారి వి.లక్ష్మణరావు, ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, తహసీల్దార్ డి.రత్నకుమార్, మండల వ్యవసాయ అధికారి జి.సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రాజాం: మండలంలోని గురవాం, పొగిరి–2 గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష శిబిరం బుధవారం నిర్వహించారు. గురవాంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శంకరరావు, పొగిరిలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.కె.రాజు లబ్ధిదారులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బి.రమణమ్మ, పి.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

- జగనన్న అమ్మఒడి కార్యక్రమంలో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



జగనన్న అమ్మఒడి పథకం చెక్కు విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని కోమటిపల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో జగనన్న అమ్మఒడి పథకం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మండలానికి సంబంధించిన పథకం చెక్కును విడుదల చేసి, కాసేపు మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన ఆరోగ్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మనబడి నాడు నేడు పథకం కింద ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. అలాగే జగనన్న గోరుముద్ద పథకం కింద పిల్లలకు రోజుకో మెనూతో పౌష్టికాహారం అందజేస్తోందన్నారు. వీటితో పాటు జగనన్న అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతిదీవెన పథకాల ద్వారా నగదు అందజేయడం జరుగుతోందన్నారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి, బొబ్బిలి మండలంలోని 10,253 మంది అమ్మఒడి పథకం లబ్ధిదారులకు రూ.15.37 కోట్లు జమచేయడం జరిగిందని, ఈ నాలుగేళ్లలో వారి బ్యాంకు ఖాతాల్లో మొత్తం రూ.63.43 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువు ఆగిపోకూడదనే ఉద్దేశ్యంతోనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల విద్యార్థికి విద్యాసంవత్సరం ఆరంభంలోనే జగనన్న విద్యాకానుక కింద పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, బ్యాగు అందిస్తున్నారన్నారు. దీంతో పాటు ఇంగ్లిష్ మీడియంలో నాణ్యమైన విద్యాబోధన అందించడం జరుగుతోందన్నారు. తల్లిదండ్రులు కూడా ప్రభుత్వ ప్రోత్సాహకాలతో విద్యార్థులను ఉన్నత విద్య వైపు ప్రోత్సహించాలని, విద్యార్థులు కూడా బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, ఎంపీపీ ఎస్.లక్ష్మి, జెడ్పీటీసీ ఎస్. శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ టి.దామోదరరావు, డిప్యూటీ డీఈఓ బ్రహ్మాజీరావు, ఎంఈఓలు లక్ష్మణరావు, వాసు, ప్రిన్సిపాల్ పురుషోది, ఎంపీపీ శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆడవరంలో గడప గడపకు..

రేగిడి: మండలంలోని ఆడవరం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

కుండపోత



రాజాం పట్టణంలో కురుస్తున్న భారీ వర్షం

రాజాం: స్థానిక పట్టణంతో పాటు పట్టణ పరిసర ప్రాంతాల్లో బుధవారం కుండపోత వర్షం కురిసింది. అకస్మాత్తుగా వాతావరణం మారిపోయి, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ఓ గంట పాటు ఏకధాటిగా పడడంతో రోడ్లు, వీధులు జలమయమయ్యాయి.

ఆస్పత్రికి వెళ్లి, పెన్షన్ అందజేత



వృద్ధునికి పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ సత్యంనాయుడు

రాజాం: మండలంలోని మొగిలివలసకు చెందిన ఆబోతుల అప్పలనాయుడు అనారోగ్యం కారణంగా విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వలంటీర్ మజ్జి సత్యంనాయుడు బుధవారం ఆయన వద్దకు వెళ్లి, పెన్షన్ అందజేశారు. దీంతో వలంటీర్ సేవలను అందరూ అభినందిస్తున్నారు.

మద్యంసీసాల స్వాధీనం

రేగిడి: మండలంలోని చిన్నయ్యపేటలో ఓ షాపులో అక్రమంగా నిల్వ ఉంచిన 19 మద్యం సీసాలను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆ షాపు యజమానిని అదుపులోకి తీసుకుని, అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపారు.

లబ్ధిదారుల గుర్తింపులో అలసత్వం వద్దు



అర్జీల వివరాలపై ఆరాతీస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రాజాం సిటీ: ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల గుర్తింపులో అలసత్వం వద్దని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు హెచ్చరించారు. బుధవారం స్థానిక పట్టణ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ, మిర్తిరెడ్డి వీధి, సత్యనారాయణపురం సచివాలయాలను సందర్శించిన ఆయన జగనన్న సురక్ష సర్వే ద్వారా వచ్చిన అర్జీల వివరాలపై ఆరాతీశారు. అర్జీలు పెట్టుకున్న వారందరికీ వారికి కావాల్సిన సేవలు అందించాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు, ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

8న వైఎస్సార్ జయంతి వేడుకలు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు మండల వైఎస్సార్ సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ జయంతి రోజున మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు పేర్కొన్నారు. అలాగే ఈనెల 9న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పుట్టినరోజును పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మెగారక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణతో పాటు మండలంలో వెయ్యి మంది పేదలకు దుస్తులు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ దన్నాన జనార్దనరావు, పార్టీ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, పతివాడ రాజారావు, చందక గురునాయుడు, బెల్లాన త్రినాథరావు, కోరుకొండ దాలయ్య, మీసాల రమణ, గొర్లె రమణ, కరణపు ఆది పాల్గొన్నారు.